## క్లుప్తంగా

### నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

**హన్మకొండ:** హనుమకొండలోని పలు ప్రాంతాల్లో మంగళవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని టీజీ ఎన్పీడీసీఎల్ హనుమకొండ టౌన్ డీఈ జి.సాంబరెడ్డి తెలిపారు. పద్మాక్షి కాలనీ, శివముక్తి ధామ్, రామకృష్ణ కాలనీ, రాజ్‌పుత్ వాడా, మల్లికాంబ, జయ కళాశాల ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి 10 గంటల వరకు, కాజీపేట ప్రాంతంలోని సోమిడి, జూబ్లీ మార్కెట్, తిలక్‌నగర్ ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అలాగే, వరంగల్‌లోని పలు ప్రాంతాల్లో మంగళవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని ఎన్పీడీసీఎల్ వరంగల్ టౌన్ డీఈ ఎస్.మల్లికార్జున్ తెలిపారు. వివేకానంద కాలనీ, సాయిటీ కాలనీ, ఎరుకల వాడ, లక్ష్మి గణపతి కాలనీ, ఏనుమాముల మార్కెట్ రోడ్డు, 100 ఫీట్ల రోడ్డు ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

### 'రేవంత్‌రెడ్డి భూ దాహానికి వర్సిటీ భూములు ఖతం'

**హన్మకొండ:** సీఎం రేవంత్ రెడ్డి భూ దాహానికి యూనివర్సిటీ భూములను కోల్పోయే ప్రమాదం ఉందని బీఆర్‌ఎస్ నేత ఏనుగుల రాకేష్ రెడ్డి ఆరోపించారు. గుడి, బడి జోలికి వెళ్లినోడు బాగుపడ్డట్లు చరిత్రలో లేదని ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. యూనివర్సిటీ భూముల జోలికి వెళ్తున్న సీఎం రేవంత్ రెడ్డికి అదే గతి పడుతుందని తెలిపారు. నెమళ్ల హింస విషయంలో, సెంట్రల్ యూనివర్సిటీ భూముల అంశంలో కేంద్ర ప్రభుత్వం జోక్యం చేసుకోవాలని కోరారు.

### టీజీడీఏ కేఎంసీ యూనిట్ ఎన్నిక

**ఎంజీఎం:** ప్రభుత్వం చేపట్టిన బదిలీల్లో భాగంగా పలువురు పదోన్నతులు, బదిలీలపై వెళ్లిన సందర్భంగా ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేసినట్లు యూనిట్ అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ చంద్రశేఖర్, అంబి శ్రీనివాస్‌లో ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఉపాధ్యక్షుడిగా డాక్టర్ సునీల్ దత్, సంయుక్త కార్యదర్శిగా లక్ష్మణ్‌రావు, ప్రసాద్‌రెడ్డి, కార్యవర్గ సభ్యులుగా మధుబాబు, రంగస్వామి, భవాని, వెంకటరత్నం, తిక్క నవీన్‌కుమార్, సృజన, టి.నవీన్‌ను ఎన్నుకున్నట్లు పేర్కొన్నారు.

### కమిటీ సభ్యులకు సన్మానం



**కాజీపేట:** కాజీపేట 62వ డివిజన్ రహమత్‌నగర్ కాలనీలో బీఎల్‌ఎం బాప్టిస్టు చర్చి నూతన కార్యవర్గం కమిటీ సభ్యులను కార్పొరేటర్ జక్కుల రవీందర్ యాదవ్ సోమవారం ఘనంగా సన్మానించారు. సీఎస్ఐ సంఘం చైర్మన్‌గా పాస్టర్ పి.విక్టర్ పాల్, అధ్యక్షుడిగా భూతపాటి వినయ్‌కుమార్, కార్యదర్శిగా పాలూరి వసంత్ కుమార్, కోశాధికారిగా సీహెచ్.సుందర్ ఎంపికయ్యారు.

### 17వ సారి పృథ్వీ రక్తదానం



**రామన్నపేట:** వరంగల్ ఎంజీఎంలోని బ్లడ్ బ్యాంక్‌లో బ్లడ్ డోనర్, యువనేతాజీ ఫౌండేషన్ సభ్యుడు, శివనగర్‌కు చెందిన ఆలువాల పృథ్వీ సోమవారం 17వ సారి స్వచ్ఛందంగా రక్తదానం చేసి యువతకు ఆదర్శంగా నిలిచారు. ఈ సందర్భంగా పృథ్వీని యువనేతాజీ ఫౌండేషన్ అధ్యక్షుడు కొత్తకొండ అరుణ్‌కుమార్, కానిస్టేబుల్ కన్నె రాజు, బొట్టు కమలాకర్, ప్రభుత్వ ఉపాధ్యాయుడు గజ్జెల సుమన్ అభినందించి సర్టిఫికెట్ అందించారు.

### ఉపాధ్యాయుడికి అభినందన



**హన్మకొండ:** హనుమకొండ పలివేల్పుల పాఠశాల ఉపాధ్యాయుడు వెనిశెట్టి రవికుమార్‌ను రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సన్మానించారు. ఉగాది పండుగను పురస్కరించుకుని ఉపాధ్యాయ వృత్తి నిర్వహిస్తూ ప్రవృత్తిగా సామాజిక సేవా కార్యక్రమాలు చేపడుతున్న వెనిశెట్టి రవికుమార్ సేవలను గుర్తించిన మంత్రి.. కరీంనగర్‌లోని క్యాంపు కార్యాలయంలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో శాలువా కప్పి జ్ఞాపిక అందించి సన్మానించారు.

### వ్యవసాయ పనులకు శ్రీకారం

**కాజీపేట:** ఉగాది కొత్త సంవత్సరాన్ని పురస్కరించుకుని కాజీపేట మండల పరిధిలోని పలు గ్రామాల్లో పలువురు రైతులు సోమవారం వ్యవసాయ పనులకు శ్రీకారం చుట్టారు. ప్రతిఏటా ఉగాది పండుగ తర్వాత సంప్రదాయ ఆచారాలను పాటిస్తూ నాగలితో చెలుకలు, పొలాలను దున్నుతారు. కొత్త ఏడాది రోజు వ్యవసాయ పనులు మొదలు పెడితే పంటలు సమృద్ధిగా పండుతాయని అన్నదాతల నమ్మకం. కుటుంబ సమేతంగా వ్యవసాయ బావుల వద్దకు చేరుకుని నాగలికి పూజలు చేసి సాగుబాటు చేశారు.

# మత సామరస్యానికి రంజాన్ ప్రతీక



వరంగల్: మాట్లాడుతున్న మంత్రి కొండా సురేఖ



మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి



కాజీపేట: ప్రార్థనలో పాల్గొన్న ముస్లింలు

- మంత్రి కొండా సురేఖ
- ఘనంగా ఈద్ – ఉల్ – ఫితర్

**వరంగల్:** రంజాన్ పండుగ.. మత సామరస్యానికి ప్రతీక అని, ముస్లింలు ఈద్ – ఉల్ – ఫితర్‌ను సంతోషంగా జరుపుకోవాలని అటవీ, దేవాదాయ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ ఆకాంక్షించారు. ఎల్‌బీనగర్‌లోని ఈద్గా ఘనీ అబ్దుల్ అజీజ్ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం జరిగిన ప్రార్థనల్లో మంత్రి పాల్గొన్నారు. కార్యక్రమంలో ఈద్గా కమిటీ అధ్యక్షుడు ఎండీ.సాధిక్, కార్యదర్శి అబ్దుల్లా, నగర మేయర్ గుండు సుధారాణి, కార్పొరేటర్ ఫుర్కాన్, షేక్‌హుస్సేన్, సర్వర్‌పాషా, ఖాదర్, వాజిత్, ఈద్గా నమాజ్ మౌలానా అతీఖుర్ రహ్మాన్ పాల్గొన్నారు.

**కాజీపేటలో..**

**కాజీపేట:** ఏఆర్‌ఆర్‌నగర్ కాలనీ శివారులోని ఈద్గా మైదానంలో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా జమా మసీదు మత గురువు షేక్ మహబూబ్ రెహమాన్ మాట్లాడుతూ పేదవారికి చేయూతనందించాలని పిలుపునిచ్చారు. సీఐ సుధాకర్ రెడ్డి ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు.

**విలీన గ్రామాల్లో..**

**మడికొండ:** కాజీపేట మండలంలోని మడికొండ, రాంపూర్ ఇండస్ట్రీయల్ ఏరియా, ఉనికిచర్ల, టేకులగూడెం, తదితర గ్రామాల్లో రంజాన్ వేడుకలను ముస్లింలు సోమవారం ఘనంగా జరుపుకున్నారు. మడికొండలో ఈద్గా స్థలం లేనందున ప్రైవేట్ స్థలంలో నమాజ్ చేశారు. ముస్లిం మత పెద్ద నసీర్ జామల్, ఉపాధ్యక్షుడు ఫారుఖ్, సెక్రటరీ ఇస్మాయిల్, ముఖీం, సహబీర్, షఫీ, జమాలుద్దీన్, గౌస్, ఇబ్రహీం, అజీజ్, వాజీద్, ఫారుఖ్ పాల్గొన్నారు.

**హసన్‌పర్తిలో..**

**హసన్‌పర్తి:** ఉదయం ఈద్గాలు, మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం ఒకరినొకరు ఆలింగనం చేసుకుంటూ పండుగ శుభాకాంక్షలు చెప్పుకున్నారు. హిందువులు సైతం నమాజ్‌లో పాల్గొని ప్రార్థనలు చేశారు. హసన్‌పర్తితో పాటు అన్ని గ్రామాల్లో రంజాన్ వేడుకలు ఘనంగా జరిగాయి.

**పేద ముస్లింలకు నిత్యావసరాల పంపిణీ**

**హసన్‌పర్తి:** భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో పేద ముస్లింలకు సోమవారం నిత్యావసర వస్తువులను పంపిణీ చేశారు. కార్పొరేటర్ గురుమూర్తి శివకుమార్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మారపల్లి రాంచంద్రారెడ్డి, మండల అధ్యక్షుడు తిరుపతి, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ చకిలం రాజేశ్వర్‌రావు, దేవస్థాన మాజీ చైర్మన్ పెద్దమ్మ శ్రీనివాస్, రైల్వే బోర్డు సభ్యులు పాల్గొన్నారు.



అలయ్ బలయ్ తీసుకుంటున్న మత పెద్దలు



ప్రార్థన అనంతరం బయటకు వస్తున్న ముస్లింలు



పెద్దమ్మగడ్డ ఈద్గాలో ముస్లింల ప్రార్థనలు



శుభాకాంక్షలు చెప్పుకుంటున్న చిన్నారులు



హసన్‌పర్తి: నిత్యావసర వస్తువుల పంపిణీ

# వైభవంగా ఉర్సు షరీఫ్ ఉత్సవాలు

**ఘనంగా హజ్రత్ హాజీ కలందర్ దర్గా గంధం**

**ఖిలా వరంగల్:** వరంగల్ ఉర్సు కరీమాబాద్‌లోని షామీర్‌పూర్‌లో హజ్రత్ హాజీ కలందర్ దర్గా పీఠాధిపతి మహ్మద్ మాషూక్ ఆధ్వర్యంలో ఉర్సు ఉత్సవాలు సోమవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. కరీమాబాద్ పురవీధుల్లో మతాలకు అతీతంగా శాస్త్రోక్తంగా గంధం, జెండా ఊరేగింపు సాగింది. ఊరేగింపులో ముస్లింలు నృత్యాలు, ఫకీర్లు విన్యాసాలు చేయగా.. సందల్ ఊరేగింపును ఘనంగా నిర్వహించారు. దర్గా పీఠాధిపతి మాషూక్.. గంధం, జెండాను ఊరేగింపుగా తీసుకొస్తుండగా ముస్లింలు ఎదురేగి మొక్కులు సమర్పించారు. గంధాన్ని మతపెద్ద సమీక్షంలో ఆయన ప్రత్యేక ప్రార్థనలు చేసి పూలు, గంధం దర్గాకు ఫాతేహాలు సమర్పించారు. అనంతరం ముస్లిం మత పెద్దలతో కలిసి సమాధికి గంధాన్ని సమర్పించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం మహాన్నదాన కార్యక్రమాన్ని పీఠాధిపతి మాషూక్ ప్రారంభించారు. మంగళవారం ఉదయం నుంచి సాయంత్రం 9గంటలకు జాతర జరగనుందని, ప్రజలు దర్గాను దర్శించుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో యాకూబ్‌పాషా, సులేమాన్, అక్బర్ మోహన్, తాజ్, ఫక్రొద్దీన్, ఖాజాపాషా, గౌస్, తాజ్ పాషా, సలీమ్‌పాషా, పోశాల స్వామి పాల్గొన్నారు.



దర్గాకు గంధం లేపనం చేసి పూలు సమర్పిస్తున్న దర్గా పీఠాధిపతి మాషూక్, ముస్లింలు

# సన్న బియ్యం పంపిణీపై హర్షం



క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

**మడికొండ:** పేదలకు సన్న బియ్యం పంపిణీ కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, సివిల్ సప్లై మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి చిత్రపటాలకు మడికొండ చౌరస్తాలో నాయకుడు పెనుకుల వినయ్ ఆధ్వర్యంలో సోమవారం క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ కార్పొరేటర్ తొట్ల రాజుయాదవ్ మాట్లాడుతూ ఇచ్చిన హామీలను ప్రభుత్వం ఒక్కొక్కటిగా అమలు చేస్తోందని అన్నారు. కార్యక్రమంలో మెట్టుగుట్ట చైర్మన్ పైడిపాల రఘుచందర్, భైరి లింగమూర్తి, వస్కుల శంకర్, రాజారపు స్వామి, కుర్ల మోహన్, నాగరాజు, బిల్ల రవీందర్, దువ్వ విజయ్, పల్లపు అర్జున్, గుర్రం జ్యోతిఅమర్‌నాథ్, వస్కుల శ్రీనివాస్, నార్లగిరి కుమార్, కొప్పుల నవీన్‌యాదవ్, సతీష్‌రెడ్డి, గడుసు రాజు, కృష్ణారెడ్డి, రసజ్ఞ, నర్సయ్య, తదితరులు పాల్గొన్నారు.

# యువకుడిపై కత్తితో దాడి

- ప్రేమ వ్యవహారంలో జోక్యమే కారణం
- దాడి పాల్పడిన యువతి కుటుంబీకులు

**ఖిలా వరంగల్:** ప్రేమ వ్యవహారంలో తరుచూ జోక్యం, మధ్యవర్తిగా ఓ యువకుడు వ్యవహరిస్తున్నాడు. యువతి కుటుంబ సభ్యులు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోక పోగా, ఆ యువకుడి జోక్యం ఎక్కువైందంటూ యువతి సోదరుడితో పాటు మరో వ్యక్తి కలిసి కత్తితో దాడికి పాల్పడ్డారు. ఈ ఘటన సోమవారం రాత్రి వరంగల్ శివనగర్‌లోని చింతల్ రోడ్డు సబ్‌స్టేషన్ వద్ద జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. శివనగర్ పాడి మల్లారెడ్డినగర్‌కు చెందిన ఓ యువతి ప్రేమ వ్యవహారంలో మైసయ్యనగర్‌కు చెందిన కందుల వినయ్ జోక్యంతోపాటు మధ్యవర్తిగా వ్యవహరిస్తున్నట్లు సమాచారం. వినయ్.. యువతి సోదరుడు మధ్య సోమవారం రాత్రి ఘర్షణ జరిగింది. వినయ్‌పై యువతి సోదరుడు, మరోవ్యక్తి కలిసి కత్తితో దాడికి పాల్పడ్డారు. గాయపడిన వినయ్‌ను కుటుంబ సభ్యులు ఎంజీఎంకు తరలించారు. వినయ్ తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిసింది.



ఎంజీఎంలో చికిత్స పొందుతున్న వినయ్

# బీసీలపై కేంద్ర ప్రభుత్వ వ్యతిరేకత



జెండా ఊపి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న రవికృష్ణ



ఢిల్లీకి వెళ్తున్న బీసీ ఇంటలెక్చువల్ ఫోరం నాయకులు

**కాజీపేట రూరల్:** బీసీలపై కేంద్ర ప్రభుత్వం వ్యతిరేకత చూపుతోందని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బైరి రవికృష్ణ గౌడ్ అన్నారు. బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ పిలుపు మేరకు 'హలో బీసీ – చలో ఢిల్లీ' కార్యక్రమానికి ఏప్రిల్ 2న ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద బీసీల పోరుగర్జన కార్యక్రమానికి వెళ్లేందుకు జిల్లా బీసీ సంఘం నాయకులు కాజీపేట జంక్షన్‌కు సోమవారం చేరుకున్నారు. బీసీ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు వడ్లకొండ వేణుగోపాల్‌గౌడ్ ఆధ్వర్యంలో రాష్ట్ర అధ్యక్షుడు రవికృష్ణగౌడ్ జెండా ఊపి బీసీ సంఘం నాయకులను రైలులో పంపించారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర నాయకులు దాడి మల్లయ్య యాదవ్, శోభారాణి, బొనగాని యాదగిరి గౌడ్, భీమగాని యాదగిరి, దూలం సిద్దయ్య, గుండగని వేణు, డేగల శ్రీనివాస్, జంపాల చంద్రశేఖర్, వేముల మహేందర్, ఆరెగంటి నాగరాజు, అశోక్, బంక సరళ, ప్రమోద, తేళ్ల సుగుణ, తదితరులు పాల్గొన్నారు.

**ఢిల్లీకి తరలిన బీసీ ఫోరం సభ్యులు**

ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద బుధవారం తలపెట్టిన బీసీ ధర్నాకు బీసీ ఇంటలెక్చువల్ ఫోరం నాయకులు కాజీపేట జంక్షన్ నుంచి రైళ్లో సోమవారం తరలివెళ్లారు. బీసీలకు విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ శాసనసభలో బిల్లును తెలంగాణ ప్రభుత్వం ఆమోదించిందని నాయకులు తెలిపారు. పార్లమెంట్‌లో కేంద్రప్రభుత్వం రాజ్యాంగ సవరణ చేసి 9వ షెడ్యూల్‌లో బిల్లు పెట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఫోరం కో ఆర్డినేటర్ ప్రకాష్, చీఫ్ కోఆర్డినేటర్ వీరాస్వామి, శ్రీనివాస్, రాజాగోవింద్, ఉపేందర్, తదితరులు పాల్గొన్నారు.

### హనుమకొండ ఈద్గాను సందర్శించిన సీపీ

**వరంగల్ క్రైం:** రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకొని హనుమకొండ బొక్కలగడ్డ ఈద్గాను వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్‌సింగ్ సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఈద్గా వద్ద బందోబస్త్ ఏర్పాట్లను పరిశీలించారు. రంజాన్ ప్రార్థనలు ప్రశాంతగా జరిగేందుకు తీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు సూచనలు చేశారు. సీపీ వెంట హనుమకొండ ఏసీపీ దేవేందర్ రెడ్డి, ఇన్‌స్పెక్టర్ సతీష్, ట్రాఫిక్ సీఐ సీతారెడ్డి ఉన్నారు.

### మార్వాడీ మహిళల గంగోర్ ఉత్సవాలు



**కాజీపేట:** రాజస్థానీ మహిళలు తమ కుటుంబ సభ్యులు ఆయురారోగ్యాలతో చల్లగా ఉండాలని ఆకాంక్షిస్తూ గంగోర్ ఉత్సవాలను కాజీపేట పట్టణంలో సోమవారం రాత్రి జరుపుకున్నారు. తమ ఇళ్లల్లో శివపార్వతులకు ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం దేవతమూర్తులు, ప్రత్యేక కుండీల్లో పెంచిన గడ్డి (కలాస్)ని నెత్తిన పెట్టుకుని పిల్లలు ఆడిపాడుతుండగా రహమత్‌నగర్ నుంచి పట్టణంలోని భ్రమరాంబిక మల్లికార్జునస్వామి దేవాలయానికి చేరుకుని ప్రత్యేక పూజలు చేశారు. ప్రతి ఏటా ఉగాది పర్వదినం తర్వాత మార్వాడీ మహిళలు జరుపుకునే ఈ ఉత్సవాలకు కాజీపేట పట్టణంలో ఓ ప్రత్యేక గుర్తింపు ఉంది. మర్వాడీ మహిళలకు మల్లన్న ఆలయ ప్రధాన పూజారి ఐనవోలు ప్రవీణ్ కుమార్ శర్మ స్వాగతం పలికి ప్రత్యేక పూజలు చేయించారు.

# లారీ – బైక్ ఢీ.. ఇద్దరికి గాయాలు

**ఎంజీఎంలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులు**

**ఖిలా వరంగల్:** బైక్‌ను లారీ ఢీకొట్టడంతో ఇద్దరికి తీవ్ర గాయాలైన సంఘటన ఖిలా వరంగల్ వాకింగ్ రోడ్డుపై సోమవారం సాయంత్రం జరిగింది. స్థానికుల కథనం ప్రకారం మైసూర్‌కు చెందిన శుభ మండల్, బిట్టు వరంగల్‌లో నివాసముంటూ బంగారం షాపుల్లో గోల్డ్ మేకర్‌గా పనిచేస్తున్నారు. సరదాగా బైక్‌పై మధ్యకోట వైపు బయల్దేరారు. ఆ సమయంలో వెనుక నుంచి బైక్‌ను లారీ ఢీకొట్టింది. దాంతో ఆ యువకులకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు గమనించి క్షతగాత్రులను 108 వాహనంలో ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. అక్కడ మండల్, బిట్టు చికిత్స పొందుతున్నారు.

**మధ్యకోట రోడ్డుపై కారు పరుగులు**
**పార్క్ చేసిన బైక్‌లను ఢీకొట్టిన డ్రైవర్**

**ఖిలా వరంగల్:** మధ్యకోట రోడ్డుపై కారు అతివేగంగా పరుగులు పెట్టింది. వేగంగా దూసుకెళ్తూ పార్క్ చేసి ఉన్న బైక్‌లను ఢీకొడుతూ ముందుకెళ్లింది. దాంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. స్థానికుల కథనం ప్రకారం.. సాయంత్రం నగరవాసులు వాకింగ్ కోసం ఖిలా వరంగల్ వాకింగ్ గ్రౌండ్ చేరుకున్నారు. నగరానికి చెందిన ఓ కారు డ్రైవర్ మద్యం మత్తులో కారును పరుగులు పెట్టించాడు. పార్క్ చేసిన బైక్‌లను ఢీకొడుతూ దూసుకెళ్లాడు. వాకర్స్ కారును వెంబడించి డ్రైవర్‌ను పట్టుకుని పోలీసులకు అప్పగించినట్లు సమాచారం.

### బందోబస్తు ఏర్పాటు చేయాలి

**ఖిలా వరంగల్:** వరంగల్ ఏసీపీ నందిరామ్‌నాయక్‌ను వరంగల్ శివనగర్‌లోని సీతారామచంద్ర స్వామి ఆలయ కమిటీ ప్రతినిధులు సోమవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఏసీపీకి కుంభాభిషేకం మహోత్సవ కరపత్రాన్ని అందజేసి ఆహ్వానించారు. వేడుకకు మంత్రి సురేఖ, పీఠాధిపతులు వస్తున్నారని, ఈక్రమంలో బందోబస్తుకు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో మంచాల కృష్ణమూర్తి, శ్రీరాం రాజేష్, యాదగిరి, నవీన్, తదితరులు పాల్గొన్నారు.



ఏసీపీకి కరపత్రాన్ని అందజేస్తున్న ప్రతినిధులు

# రాముడి జీవితం మానవాళికి ఆదర్శం



ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

**కాజీపేట:** మానవాళికి మంచి జరగాలనే ఆకాంక్ష, నైతిక విలువలను పెంపొందించాలనే లక్ష్యంతో మహావిష్ణువు శ్రీరామచంద్రుడిగా జన్మించి అవతార పురుషుడిగా అవతరించాడని పండుతుడు అయినవోలు రాధాకృష్ణ శర్మ గుర్తుచేశారు. కాజీపేట పట్టణంలోని స్వయంభూ శ్వేతార్క మూలగణపతి దివ్యక్షేత్రం ఆవరణలో శ్రీరామ నవమి నవరాత్రోత్సవాలను పురస్కరించుకుని హిందు మతంలో రామాయణ ప్రాశస్త్యం అనే అంశంపై సోమవారం ఆయన ఉద్బోధించారు. శ్రీరాముడి జీవితం ప్రతీఒక్కరికి ఆదర్శమని అన్నారు. శ్రీరామ సీతారామలక్ష్మణులకు ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం రామాయణం వినడం వల్ల, పఠించడం వల్ల కలిగే ఫలితాలను భక్తులకు రాధాకృష్ణ శర్మ విన్నవించారు.

# అస్సాంలో పేరిణి నృత్య ప్రదర్శన

**హన్మకొండ కల్చరల్:** వరంగల్ కళాకృష్ణ నృత్య జ్యోతి అకాడమీ ఆధ్వర్యంలో పేరిణి నాట్యాచార్యుడు గజ్జెల రంజిత్ బృందం అస్సాంలో ప్రదర్శించిన పేరిణి నృత్యం అలరించింది. అస్సాంలోని గౌహతి కల్చరల్ ట్రస్ట్ ఆడిటోరియంలో అస్సాం తెలుగు అసోసియేషన్ సౌజన్యంతో ఆదివారం రాత్రి నిర్వహించిన ఉగాది వేడుకల్లో భాగంగా జరిగిన సాంస్కృతిక కార్యక్రమాల్లో పేరిణి నృత్య ప్రదర్శన జరిగింది. ఈ సందర్భంగా తెలుగు అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర నృత్యంగా గుర్తింపు పొందిన పేరిణి నాట్యాన్ని చూడటం మొదటిసారని, ఇది అద్భుతంగా ఉందని కొనియాడారు. అనంతర కళాకారులను సన్మానించారు. పేరిణి ప్రదర్శనలో చాతరాజు నవ్యజ, రేగుల చందు, లోహిత్, గురుదేవ్, సంతోష్, శ్రీజ, వైష్ణవి, తేజస్విని, విద్యశ్రీ, కీర్తన పాల్గొన్నారు.



అస్సాంలో నృత్యం ప్రదర్శిస్తున్న కళాకారులు

### వేసిన వారానికే పగుళ్లు

- నాసిరకంగా రోడ్ల నిర్మాణం
- అధికారుల పర్యవేక్షణ కరువు

**హసన్‌పర్తి:** గ్రామాల్లో అభివృద్ధి పనులపై అధికారుల పర్యవేక్షణ కరువైంది. దాంతో నిర్మించిన వారానికే రోడ్లపై పగుళ్లు ఏర్పడ్డాయి. హసన్‌పర్తి మండలం సీతంపేటలో మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం కింద రోడ్ల నిర్మాణం కోసం రూ.10 లక్షలు మంజూరయ్యాయి. ఈ పనులను స్థానిక కాంగ్రెస్ నాయకులు చేపడుతున్నాయి. కాంట్రాక్టర్లు అధికార పార్టీ నాయకులు కావడం వల్ల సంబంధిత శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షించడం లేదనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. రోడ్లు నిర్మించి క్యూరింగ్ చేయకపోవడం వల్ల పగుళ్లు ఏర్పడ్డాయి. నాసికరంగా పనులు చేపడుతున్నారని, సైడ్‌బర్మ్‌లు ఏర్పాటు చేయడం లేదని స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విషయపై అధికారులకు విన్నవించినా వారు స్పందించడం లేదని విమర్శిస్తున్నారు.



రోడ్డుపై ఏర్పడిన పగుళ్లు

# విద్యార్థులపై లాఠీచార్జ్ హేయమైన చర్య



కేయూ రెండో గేట్ వద్ద డీవైఎఫ్ఐ నిరసన



సమావేశంలో మాట్లాడుతున్న నర్సింహారావు



హనుమకొండలో అమరవీరుల స్తూపం వద్ద..

**కేయూ క్యాంపస్:** హెచ్‌సీయూ విద్యార్థులపై లాఠీచార్జ్ చేయడం హేయమైన చర్య అని, హెచ్‌సీయూ భూములను వేలం వేయొద్దని ఏబీవీపీ రాష్ట్ర కార్యదర్శి మాచర్ల రాంబాబు డిమాండ్ చేశారు. ఈమేరకు కాకతీయ యూనివర్సిటీ మొదటి గేట్ వద్ద ప్రభుత్వ దిష్టిబొమ్మను సోమవారం దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు కోసం హెచ్‌సీయూ భూములను తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి వేలం వేసేందుకు కుట్రలు పన్నుతున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో ఏబీవీపీ కేయూ అధ్యక్షుడు మెరుగు సాయికుమార్, ఇన్‌చార్జ్ నిమ్మల రాజేష్, బాధ్యులు అంబాల కిరణ్, డాక్టర్ రాజ్‌కుమార్, ప్రశాంత్, పూజ, శివ, సాయిప్రియ, అభి, ఫణీంద్ర, తదితరులు పాల్గొన్నారు.

**ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో..**

హైదరాబాద్‌లోని సెంట్రల్ యూనివర్సిటీ భూములను అమ్మకానికి పెట్టొద్దని ఆ యూనివర్సిటీ విద్యార్థులు నిరసన తెలుపుతుండగా వారిని పోలీసులు అక్రమంగా అరెస్టు చేశారని ఎస్‌ఎఫ్‌ఐ కేయూ నాయకులు సోమవారం నిరసన తెలిపారు. ఈమేరకు కాకతీయ యూనివర్సిటీ మొదటి గేట్ ఎదుట ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేయబోతుండగా పోలీసులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా ఎస్‌ఎఫ్‌ఐ హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి మంద శ్రీకాంత్ మాట్లాడుతూ హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూముల జోలికి వస్తే ఊరుకునేది లేదన్నారు. కార్యక్రమంలో నాయకులు కన్నారావు, రాహుల్, అఖిల్, శీను, రాజ్‌కుమార్, కళ్యాణ్‌రామ్ తదితరులు పాల్గొన్నారు.

**డీఎస్‌ఏ ఆధ్వర్యంలో..**

హెచ్‌సీయూ భూముల వేలాన్ని నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ డెమొక్రటిక్ స్టూడెంట్స్ అసోసియేషన్ (డీఎస్‌ఏ) ఆధ్వర్యంలో కేయూ మొదటి గేట్ వద్ద సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను సోమవారం దహనం చేశారు. కార్యక్రమంలో డీఎస్‌ఏ రాష్ట్ర కన్వీనర్ శ్రావణ్, బాధ్యులు శివ, కృష్ణ, సంజయ్, మహేష్, వంశీ తదితరులు పాల్గొన్నారు.

**భూముల వేలాన్ని నిలిపివేయాలి**

సెంట్రల్ యూనివర్సిటీ భూముల వేలాన్ని నిలిపివేయాలని పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు నర్సింహారావు డిమాండ్ చేశారు. కేయూలో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సెంట్రల్ యూనివర్సిటీ విద్యార్థుల అక్రమ అరెస్టులను ఖండించాలన్నారు. గ్రేటర్ వరంగల్ అధ్యక్షుడు వినయ్, నాయకులు వంశీ, అజహర్, రమేష్, అఖిల్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

**పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో..**

**హన్మకొండ / విద్యారణ్యపురి:** హైదరాబాద్‌లోని సెంట్రల్ యూనివర్సిటీలోని భూములను వేలం వేయడాన్ని నిరసిస్తూ హనుమకొండలో తెలంగాణ అమరవీరుల స్తూపం వద్ద సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను పీడీఎస్‌యూ నాయకులు సోమవారం దహనం చేశారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ ఉమ్మడి వరంగల్ జిల్లా కార్యదర్శి మర్రి మహేష్ మాట్లాడుతూ దేశం గర్వించే విధంగా ఎంతోమంది మేధావులను అందించిన సెంట్రల్ యూనివర్సిటీ భూములను వేలం వేయడమంటే యూనివర్సిటీల పతనాన్ని కోరుకున్నట్లేనని ఎద్దేవా చేశారు. పీడీఎస్‌యూ నాయకులు రాజేష్, అనిల్, పవన్‌సాయి, రాజేష్, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

**డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో..**

హెచ్‌సీయూ భూముల వేలాన్ని నిలిపివేయాలని డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో కాకతీయ యూనివర్సిటీ రెండో గేట్ వద్ద నిరసన తెలిపారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి తిరుపతి, జిల్లా ఉపాధ్యక్షుడు మంద సుచందర్, బాధ్యులు ఓర్సు చిరంజీవి, వేలు సన్నీ, రమణారెడ్డి, రమేష్, శ్రీకాంత్, చంటి తదితరులు పాల్గొన్నారు.